
# ఆంటన్ చెహోవ్

# డార్లింగ్ (1899)

అనువాదం:

ఎ.వి. రమణమూర్తి




రిటైర్డ్ కాలేజ్ ప్రొఫెసర్ కూతురు ఓలెంకా (అసలు పేరు ఓల్గా సెమియొనోవా) ఇంటివెనక ఆవరణలో కూర్చుని దీర్ఘాలోచనలో పడిపోయి ఉంది. వాతావరణం చాలా వేడిగా ఉంది; పైగా ముసురుకొని విసిగిస్తున్న ఈగలొకటి. ఇక త్వరలోనే సాయంత్రం కాబోతూందన్న ఆలోచనే ఆహ్లాదకరంగా ఉంది. తూర్పునుంచి నల్లటి మేఘాలు కమ్ముకొస్తున్నాయి, అప్పుడప్పుడూ చల్లని గాలుల సూచనలిస్తూ.

ఆ ఇంటి వెనక ఉన్న గదుల్లో అద్దెకుంటున్న కుకిన్ ఆవరణ మధ్యలో నుంచుని ఆకాశం కేసి చూస్తూవున్నాడు. టివోలీ అమ్యూజ్‌మెంట్స్ పేరిట నాటక ప్రదర్శనలు నిర్వహిస్తూ ఉంటాడు అతను.

“అబ్బా, మళ్లీనా! మళ్లీ వర్షం పడబోయేట్టు ఉంది. ప్రతిరోజూ వర్షం కురుస్తోంది. ప్రతిరోజూ! కావాలని పడుతున్నట్టుంది. ఇలా అయితే సర్వనాశనం. ప్రతిరోజూ నష్టాలే…” అన్నాడు నిరాశగా.

చేతులు పైకెత్తేసి, ఓలెంకాకి చెప్పటం కొనసాగించాడు.

“జీవితం అంటే ఇదీ ఓల్గా! ఏడిపిస్తుంది. నువ్వు పనిచేస్తావు, అవధుల మేరకు కృషి చేస్తావు, కష్టపడతావు, నిద్రకూడా పోవు- ఇంకా బాగా ఎలా చేయాలా అని ఆలోచిస్తూ. చివరికి జరిగేది ఏమిటి? ఒకపక్క చూస్తే ప్రేక్షకుల మొరటుతనం. మంచి సంగీత నాటకాలనీ, మంచి ప్రదర్శనలనీ, మంచి గాయకులనీ పెడతాను. కానీ వాళ్లు వాటిని ఆస్వాదిస్తున్నారా? లేదే! వాళ్లకి చవకబారు హాస్యం కావాలి. నేలబారు విషయాలు కావాలి.

సరే, ఇంకోపక్కన చూస్తే- ఈ వాతావరణం, ఈ వర్షాలు. ప్రతి సాయంత్రమూ వర్షమే. సరీగ్గా మే నెల పదో తారీఖున మొదలైన వర్షాలు, అప్పట్నుంచీ ఏకధాటిగా కురుస్తూనే ఉన్నాయి. చాలా దారుణం. జనాలు రారు సరే, కానీ నేను థియేటర్‌కి అద్దె కట్టాలి కదా? కళాకారులకి జీతాలివ్వాలి కదా?"

ఆ మరుసటి రోజు కూడా మబ్బులు కమ్ముకున్నాయి. కుకిన్ వెర్రిగా నవ్వుకుంటున్నాడు. "సరే కానీ, కురవనీ! ఆ వర్షంలో ఈ తోటని కొట్టుకుపోనీ. దాంతోబాటు నేనూ. ఈ జన్మలోనూ, పై జన్మలోనూ ఇక సంతోషం అనేదే లేకుండా పోతే పోనీ. కళాకారులందరూ నా మీద దావా వేసి, నన్ను ఏ సైబీరియాలోని జైల్లోనో పెట్టనీ! ఉరికంబం – హా, హా, హా!"

మూడో రోజూ అదే తంతు.

కుకిన్ చెబుతున్నదంతా ఓలెంకా మౌనంగా, శ్రద్ధగా వింది. వింటున్న కొద్దీ, కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. చివరికి, ఆ బాధలన్నీ ఓలెంకా మనసుని మెలిపెట్టాయి. ఆమె అతనితో ప్రేమలో పడిపోయింది. చూపులకి అతను పలచగా, పొట్టిగా, పాలిపోయిన మొహంతో ఉంటాడు. మొహం అంతా విచారం కమ్ముకుని ఉంటుంది, మాట్లాడుతున్నప్పుడు మూతి ఒక పక్కకి తిరిగిపోతూ ఉంటుంది. అయినప్పటికీ, అతను ఓలెంకాలో ఒక నిజమైన, లోతైన ప్రేమభావనని కలగజేయగలిగాడు. ఓలెంకా ఎప్పుడూ ఎవరో ఒకర్ని ప్రేమిస్తూనే ఉంటుంది. ప్రేమించకుండా తను బతకలేదు. జబ్బుపడి, చీకటి గదిలో ఒక వీల్‌చైర్‌లో కూచుని బరువుగా ఊపిరి తీసుకుంటూ ఉన్న తన తండ్రిని ఒకప్పుడు ప్రేమించింది. చుట్టపుచూపుగా ఎప్పుడో గానీ వచ్చి చూడని తన అత్తని కూడా ప్రేమించింది. అంతకుముందు చాలా రోజుల క్రితం, హైస్కూల్లో ఉన్నప్పుడు తన ఫ్రెంచ్ మాస్టార్ని ప్రేమించింది. ఓలెంకా చూట్టానికి ఆరోగ్యంగా ఉంటుంది. మృదుస్వభావి, మెత్తని జాలిగుండె, అమాయకపు కళ్లు. ఆమె గులాబీరంగు చెక్కిళ్లూ, ఒక చిన్న అందమైన పుట్టుమచ్చతో ఉండే ఇంకా అందమైన ఆమె తెల్లటి మెడా, చక్కటి నిర్మలమైన ఆమె చిరునవ్వూ చూసిన మగవాళ్లు "చాలా బాగుందే!" అనుకుని ఒక చిరునవ్వుతో దాటుకుంటూ వెళతారు. అదే ఆడవాళ్లయితే, సంతోషాన్ని ఆపుకోలేక, ఓలెంకా చేతుల్ని తమ చేతుల్లోకి తీసుకుని "ఓ, డార్లింగ్!" అంటారు.

తండ్రినుంచి సంక్రమించిన ఈ ఇంట్లోనే ఓలెంకా చిన్నప్పటినుంచి ఉంటోంది. ఊరికి ఒక చివరన ఉండే ఈ ఇంటికి కొద్దిదూరంలోనే టివోలీ నాటక ప్రదర్శనశాల ఉంది. సాయంత్రాలూ, రాత్రుళ్లూ

అక్కడినుంచి ఆర్కెస్ట్రా హోరు, అక్కడ కాల్చే టపాసుల ధ్వనులూ అన్నీ వినబడుతూ ఉంటాయి. ఆమెకి అదంతా విధితోనూ, కళాహృదయం లేని ప్రేక్షకులతోనూ కుకిన్ చేస్తున్న పోరాటంలా అనిపిస్తుంది. ఒక మధురభావంతో ఆమె హృదయం ఆక్రోశించింది. ఆ రాత్రి కంటిమీదకి నిద్ర రాలేదు. మర్నాటి ఉదయం అతను తన గదికి వచ్చాక, ఓలెంకా వెళ్లి అతని గది తలుపుల మీద చిన్నగా తట్టి, తన తల, ఒక భుజం మాత్రం కనిపించేలా లోపలికి తొంగిచూసి మృదువుగా నవ్వింది…

అతను పెళ్లి ప్రస్తావన తీసుకుని వచ్చాడు, ఇద్దరూ పెళ్లిచేసుకున్నారు. ఆమె మెడనీ, బొద్దుగా ఆరోగ్యంగా ఉన్న ఆమె భుజాల్నీ దగ్గరనుంచి పరిశీలనగా చూసిన అతను ఉద్వేగంతో, "ఓ, డార్లింగ్!" అన్నాడు.

అతను సంతోషంగానే ఉన్నాడు కానీ, ఆ పెళ్లిరోజు పగలూ రాత్రీ వర్షం కురవడంతో అతని మొహం మీద కమ్ముకున్న ఒక నిరాశా రేఖ మాత్రం చెరిగిపోకుండా అలానే నిలిచిపోయింది.

పెళ్లి తర్వాత రోజులు బాగానే గడిచాయి. ఆమె కూడా వెళ్లి థియేటర్ దగ్గర టికెట్లు అమ్మేది; అక్కడి తోటలో పనులు పర్యవేక్షించేది; జమాపద్దులన్నీ రాసేది; జీతాలు పంచేది. ఆమె గులాబీ రంగు చెక్కిళ్లూ, మనోహరమైన అమాయకపు నవ్వూ అన్నిచోట్లా మెరుస్తూ ఉండేవి. జీవితంలో అన్నింటికన్నా అతిముఖ్యమైన, అత్యవసరమైన, అత్యంత విశిష్టమైన అంశం థియేటరేననీ; మనిషి ఆనందాన్నీ, కొత్తచూపునీ, సున్నితత్వాన్నీ పొందగలిగింది అక్కడ మాత్రమే అని తనకు తెలిసినవాళ్లందరికీ చెబుతూ ఉండేది ఓలెంకా.

"కానీ జనాలకి ఇదంతా ఎక్కుతుందా? వాళ్లకి కావాల్సింది వెకిలి హాస్యం. నిన్నటికి నిన్న మేము *ఫౌస్ట్ ఇన్‌సైడ్ ఔట్* నాటకం ప్రదర్శిస్తే, హాలు మొత్తం దాదాపు ఖాళీ. అదే వానిచ్కా, నేనూ కలిసి ఒక నేలబారు ప్రదర్శన ఏర్పాటు చేసామా, థియేటర్ అంతా నిండిపోతుంది. రేపు వానిచ్కా, నేనూ *ఆర్ఫియస్ ఇన్ ద అండర్‌వరల్డ్* ప్రదర్శిస్తున్నాం. మీరు తప్పకుండా రావాలి," అని చెబుతూ ఉండేది.

అంతే కాదు. థియేటర్ గురించీ, నటులని గురించీ కుకిన్ ఏది అంటే అదే ఆమె వల్లించేది. ప్రేక్షకుల ఉదాసీనతనీ మూర్ఖత్వాన్నీ అతను ఎలా నిరసిస్తాడో, తనూ అలానే చేసేది; రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు దూర్చుకొని పోయేది, అక్కడ నటులకి సూచనలు ఇచ్చేది, ఆర్కెస్ట్రా వాళ్లు సరీగ్గా నిర్వహిస్తున్నారా లేదా చూసేది. ప్రదర్శన గురించి ఏదైనా స్థానిక పేపర్ తక్కువచేసి రాస్తే ఏడ్చేది. అంతేకాదు, ఆ పత్రిక ఆఫీసుకి వెళ్లి వాళ్ల సంజాయిషీ అడిగేది.

నటులందరూ ఆమె అంటే ఇష్టంగానే ఉండేవాళ్లు. 'వానిచ్కా, నేనూ' అనీ, 'డార్లింగ్' అనీ ఆమెని పిలుస్తూండేవాళ్లు. వాళ్లంటే జాలితో ఆమె అప్పుడప్పుడూ చిన్నచిన్న మొత్తాలు అప్పిస్తూ ఉండేది. ఎవరైనా ఒకవేళ అది ఎగ్గొట్టి మోసం చేస్తే మౌనంగా ఏడ్చేది తప్ప, భర్తకి ఫిర్యాదు చేసేది కాదు.

ఆ శీతాకాలం కూడా వాళ్లు హాయిగా గడిపారు. టౌన్‌లో ఉన్న పెద్ద థియేటర్‌ని ఆ శీతాకాలం మొత్తానికి అద్దెకి తీసుకుని, కొద్దిరోజులపాటు అవసరమైన చిన్న ట్రూప్‌లకి దాన్ని అద్దెకిస్తూ ఉండేవాళ్లు. ఓలెంకా కొద్దిగా ఒళ్లు చేసింది. లోపల నిండిపోయివున్న సంతృప్తి ఆమె శరీరానికి ఒక ప్రకాశాన్ని ఇచ్చేది. కుకిన్ మాత్రం ఇంకా సన్నగా అయిపోతూ, ఇంకా ఇంకా పాలిపోతూ, విపరీతమైన నష్టాలు వస్తున్నాయని వాపోతూ ఉండేవాడు- నిజానికి ఆ శీతాకాలం థియేటర్ వసూళ్లు బాగానే ఉన్నప్పటికీ. రాత్రిళ్లు దగ్గుతూ ఉండేవాడు. ఆమె అతనికి అవీ ఇవీ కషాయాలు ఇచ్చి, యూ-డీ-కొలోన్‌తో ఉపశమనాలు చేసి, వెచ్చటి శాలువాలు కప్పి పడుకోబెడుతూ ఉండేది.

"నా బంగారుకొండవి కదూ!" అనేది ప్రేమగా. అతని జుట్టు సవరిస్తూ, "నా బుజ్జికొండవి కదూ!" అని ముద్దు కూడా చేసేది.

ఈస్టర్‌కి ముందు ఒక కొత్త ట్రూప్‌ని తీసుకురావడానికి అతను మాస్కో వెళ్లవలసి వచ్చింది. అతను లేకుండా ఆమె నిద్రపోలేకపోయింది. రాత్రంతా మేలుకుని, కిటికీ దగ్గర కూచుని నక్షత్రాలని చూస్తూ గడిపేది. తనని తాను కోడిపెట్టలతో పోల్చుకుంది. పుంజు లేనప్పుడు అవి ఎంత ఆందోళనగా ఉంటాయి కదా అనుకొంది. మాస్కోలో కుకిన్ మరికొద్ది రోజులు ఉండాల్సి వచ్చింది. ఈస్టర్ నాటికి తిరిగివస్తానని ఉత్తరం రాస్తూ, టివోలీ థియేటర్ నిర్వహణ గురించి కొన్ని సూచనలు కూడా అందులో రాసాడు. కానీ సరీగ్గా ఈస్టర్‌కి ముందువారం హోలీ సోమవారం రోజున, అర్థరాత్రి సమయాన, బయట గేటు మీద ఎవరో పెద్దగా కొడుతున్న చప్పుడయింది. నిద్రపోతూ ఉన్న వంటమనిషి గేటు తీయడానికి పరిగెత్తుకుంటూ వెళ్లింది.

బయటినుంచి ఎవరో అరుస్తున్నారు. "గేటు తీయండి. మీకు టెలిగ్రాం వచ్చింది."

ఓలెంకాకి భర్తనుంచి ఇదివరలో టెలిగ్రాములు రాకపోలేదు. కానీ ఇప్పుడెందుకో శరీరం మొద్దుబారినట్టయిపోయింది. వణికే చేతుల్తో టెలిగ్రాం తెరిచి చదివింది.

IVAN PETROVITCH DIED SUDDENLY TO-DAY. AWAITING IMMATE INSTRUCTIONS FUFUNERAL TUESDAY.

టెలిగ్రాం అలా ఉంది- 'ఇమ్మేట్', 'ఫ్యుఫ్యునెరల్' లాంటి తప్పుల్తో. అక్కడి ట్రూప్ మేనేజర్ పంపించాడు ఆ టెలిగ్రామ్‌ని.

"అయ్యో నా బుజ్జి కన్నా, వానిచ్కా! అయ్యో, అయ్యో! అసలు నిన్నెందుకు కలిసాను? నిన్నెందుకు ప్రేమించాను? ఈ పిచ్చి ఓలెంకాని వదిలేసి ఎలా వెళ్లిపోయావు నా బుజ్జికొండా?" అని రోదించింది ఓలెంకా.

ఆ మంగళవారం మాస్కోలో కుకిన్ ఖననం జరిగింది. ఓలెంకా బుధవారం నాటికి ఊరికి తిరిగి వచ్చేసింది. వచ్చీరాగానే, తన మంచం మీద కూలిపోయి ఏడవసాగింది. ఎంత పెద్దగా అంటే, వీధిలో పోతున్నవాళ్లకీ, ఆ చుట్టుపక్కల ఇళ్లవాళ్లకీ కూడా ఆ ఏడుపులు వినబడ్డాయి.

చుట్టుపక్కల ఆడవాళ్లు అనుకున్నారు: "పాపం డార్లింగ్! డార్లింగ్ ఓల్గా సెమియొనోవా! ఎంత కష్టం వచ్చింది తనకి... ఎంతలా ఏడుస్తోందో కదా తను!"



మూడునెలల తర్వాత ఒకరోజు ఓలెంకా చర్చ్ నుంచి తిరిగి వస్తోంది- విచారంగానూ, దుఃఖభారంతోనూ. ఆమె పక్కనే ఊళ్లోని కలప డిపో మేనేజర్, ఆమె ఇంటి చుట్టుపక్కలే ఉండే వాసిలీ పుస్తోవలోవ్ కూడా నడుస్తూ రావడం సంభవించింది. అతను కూడా చర్చ్ నుంచి తిరిగివస్తూ ఉన్నాడు. నెత్తిమీద ఒక స్ట్రా హాట్ పెట్టుకుని ఉన్న పుస్తోవలోవ్, గోల్డ్ చైన్ ఉన్న వెయిస్ట్‌కోట్ వేసుకుని వున్నాడు. ఆ ఆహార్యంలో అతను వ్యాపారం చూసుకునే మేనేజర్‌గా కంటే, డబ్బున్న భూస్వామిలాగా కనిపిస్తూ ఉన్నాడు.

"ప్రతిదాంట్లోనూ ఒక క్రమం ఉంటుంది, ఓల్గా," అన్నాడు అతను సానుభూతి నిండిన గంభీరమైన స్వరంతో. "మనకి దగ్గరైన వాళ్లు ఎవరైనా చనిపోతే, అది దేవుడి నిర్ణయం అని అనుకోగలగాలి. దాన్ని హుందాగా స్వీకరించి, మనల్ని మనం సంబాళించుకోవాలి."

ఓలెంకా ఇంటి గేటు వరకూ వచ్చి, అతను బై చెప్పి వెళ్లిపోయాడు. ఆ రోజంతా ఆమెకి అతని గంభీరమైన గొంతే వినిపిస్తూ ఉంది. కళ్లు మూసుకుంటే అతని నల్లని గడ్డమే కనిపిస్తూ ఉంది. ఆమెకి అతను చాలా నచ్చాడు. అతనికి కూడా ఆమె బాగా నచ్చినట్టే ఉంది- ఎందుకంటే, కొద్దిరోజుల తర్వాత ఆమెకి కొద్దిగా పరిచయం

ఉన్న ఒక పెద్దావిడ ఇంటికి వచ్చి, కూర్చున్న వెంటనే పుస్తోవలోవ్ గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. ఎంత మంచి మనిషి! ఎంత గట్టి మనిషి! అసలు ఎవరైనా ఎంత సంతోషంగా అతన్ని పెళ్లిచేసుకోవచ్చు! ఇలా సాగింది. మూడురోజుల తర్వాత పుస్తోవలోవ్ స్వయంగా ఆమె ఇంటికి వచ్చాడు. మహా అయితే పదినిమిషాలు కూర్చున్నాడేమో. ఆ కొద్ది సమయంలో అతను మాట్లాడింది కూడా చాలా తక్కువే. దానికే ఓలెంకా అతని ప్రేమలో పడిపోయింది. ఎంతగా అంటే, రాత్రంతా నిద్రపట్టలేదు, ఒళ్లంతా జ్వరం వచ్చినట్టు కాలిపోతూ ఉంది. ఉదయాన్నే ఆ పెద్దావిడకి కబురు పెట్టింది. త్వరలోనే సంబంధం ఖాయమైంది, వెనువెంటనే పెళ్లి జరిగింది.

పెళ్లి తర్వాత పుస్తోవలోవ్, ఓయెంకా రోజులు హాయిగా గడిపారు. అతను కలప డిపోలో సాధారణంగా మధ్యాహ్నం వరకూ కూర్చుని తర్వాత బయటి పనుల మీద వెళ్లేవాడు. ఆ సమయంలో ఓలెంకా అతని ఆఫీసులో సాయంత్రం వరకూ కూర్చుని, ఎకౌంట్స్, ఆర్డర్లూ చూసుకుంటూ ఉండేది.

"ప్రస్తుతం కలప ధర సంవత్సరానికి ఇరవై శాతం చొప్పున పెరుగుతోంది తెలుసా?" అని కస్టమర్లకీ, తెలిసినవాళ్లకీ చెబుతూ ఉండేది. "ఇంతకుముందు లోకల్‌గా దొరికే కలపతో వ్యాపారం చేసేవాళ్లం. ఇప్పుడు వాసిచ్‌కా కలపకోసం మొగిలెవ్ దాకా వెళ్లాల్సి వస్తోంది. పన్నులు, రవాణాలూ అదనపు భారం!" అని చెంపలకి రెండు అరిచేతులూ ఆన్చుకుని ఒక భయానకమైన దృశ్యాన్ని చెబుతున్నట్టు చెప్పేది. "ప..న్ను..లు!"

అసలు తను చాలా కాలంగా ఈ కలప వ్యాపారంలో ఉన్నట్టూ, అసలు కలపే జీవితంలో అతి ముఖ్యమైన, అత్యంత అవసరమైన వస్తువు అయినట్టూ ఆమెకి అనిపించడమే కాకుండా, కలపకి సంబంధించిన ఏ పారిభాషిక పదాన్ని విన్నా అది చాలా ఆప్యాయంగా ఆమెకి వినిపించేది. రాత్రిళ్లు పడుకున్నప్పుడు కలప దుంగలూ, చెక్కలూ పెద్ద పెద్ద రాశుల్లాగా కలల్లో దర్శనమిచ్చేవి. ఎక్కడో దూరం నుంచి కలపని మోసుకొస్తున్న అసంఖ్యాకమైన బళ్లు కనిపిస్తుండేవి. ఆ కలప దుంగలు డిపో ఆవరణ అంతా కలయతిరుగుతున్నట్టూ, ఒకదాన్నొకటి ఢీకొట్టుకుని శబ్దాలు చేస్తున్నట్టూ, కిందపడుతూ పైకి లేస్తూ, ఒకదాని మీద మరొకటి పడుతున్నట్టూ కలలే కలలు. ఇలా కలలు కంటూ నిద్రలోనే ఏడుస్తూ ఉండే ఓలెంకాని పుస్తోవలోవ్ మృదువుగా అడిగేవాడు: "ఓలెంకా, ఏమైంది?"

భర్త ఏది ఆలోచిస్తే, తనూ అదే ఆలోచించేది. ఉదాహరణకి ఆ గది వేడిగా ఉందనో, వ్యాపారం

కొంచెం మందగించిందనో అతను అనుకుంటే, ఆమె కూడా అదే అనుకునేది. అతనికి వినోద కార్యక్రమాల పట్ల పెద్దగా ఆసక్తి లేకపోవడంతో ఆదివారాలు అతను ఇంట్లోనే ఉండిపోయేవాడు. ఆమె కూడా.

"నువ్వు ఎప్పుడూ ఆఫీసులోనో, ఇంట్లోనో ఉండిపోతున్నావు. ఏ థియేటర్‌కో వెళ్లాలి డార్లింగ్, కనీసం ఏ సర్కస్‌కో అయినా," అనేవాళ్లు తెలిసినవాళ్లు ఆమెతో.

"వాసిచ్‌కా, నేనూ థియేటర్లకి వెళ్లేంత ఖాళీసమయమే లేదసలు," అనేది ఆమె గంభీరంగా. "ఇద్దరం పనిచేస్తున్నాం కదా, అలాంటి చిన్న విషయాలని పట్టించుకోలేం. అసలయినా, ఆ థియేటర్ల వల్ల ఏమిటి ప్రయోజనం?" అనేది.

శనివారాలు సాయంకాలపు ప్రార్థనలకీ, ఆదివారాలు ఉదయపు ప్రార్థనలకీ వెళ్లేవాళ్లు వాళ్లిద్దరూ. చర్చ్ నుంచి తిరిగివస్తున్నప్పుడు వాళ్ల ముఖాలు నిర్మలంగా ఉండేవి. కలిసి పక్కపక్కనే నడుస్తూ వచ్చేవాళ్లు. ఇద్దరి శరీరాలూ ఏవో సుగంధాలని వెదజల్లుతూ ఉండగా, ఆమె సిల్క్ డ్రస్ ఒరిపిడితో చిరుశబ్దాలు చేసేది. ఇంట్లో మంచి మంచి బ్రెడ్స్‌తో టీలు తాగుతూ, పేస్ట్రీలు తింటూ ఉండేవాళ్లు. ప్రతిరోజు మధ్యాహ్నం వాళ్ల ఇంట్లోనుంచి బీట్‌రూట్ సూప్, మటనో ఫిషో వంటల ఘుమఘుమలు ఆ ఇంటిముందు నుంచి వెళుతున్నవాళ్లని ఆకలితో చుట్టుకుపోయేలా చేసేవి. ఆఫీసులో నీళ్లు నిరంతరం మరుగుతూ ఉండేవి, వచ్చిన కస్టమర్లకి టీలతో మర్యాదలు జరుగుతూ ఉండేవి. వారానికోసారి ప్రత్యేక స్నానాలకి వెళ్లి, కమిలిన శరీరాలతో పక్కపక్కనే నడుచుకుంటూ వచ్చేవారు.

"ఏదేమైనా, హాయైన జీవితం గడుపుతున్నాం," అనేది ఓలెంకా తెలిసినవాళ్లతో. "దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. వాసిచ్‌కా, నేనూ అనుభవిస్తున్న ఇలాంటి జీవితాన్నే దేవుడు అందరికీ ఇవ్వాలి," అనేది.

పుస్తోవలోవ్ కలపకోసం మొగిలెవ్ ప్రాంతాలకి వెళ్లినప్పుడు ఆమెకి చాలా శూన్యంగా అనిపించేది. రాత్రిళ్లు నిద్రపోకుండా ఏడుస్తూ కూర్చునేది. ఆర్మీలో వెటరినరీ సర్జన్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం వీళ్ల ఇంటివెనక గదుల్లో అద్దెకుంటున్న స్మిర్నిన్ అప్పుడప్పుడూ సాయంత్రాలల్లో ఆమెని పలకరిస్తూ ఉండేవాడు. తమాషా కబుర్లు చెప్పో, కాసేపు కార్డ్స్ ఆడో ఆమె మనసుని కాస్త తేలికపరుస్తూ ఉండేవాడు. వీటన్నిటికంటే కూడా అతను తన సంసార జీవితం గురించి చెప్పే కథలే ఎక్కువ ఆసక్తికరంగా ఉండేవి. అతనికి పెళ్లైంది, ఒక కొడుకు కూడా. కానీ భార్యకి ఉన్న వేరే అక్రమ

సంబంధం వల్ల ఇద్దరూ విడిపోయారు. ఇతనికి ఆవిడంటే అసహ్యం. కొడుకు ఖర్చుల కోసం నెలకి నలభై రూబుల్స్ ఆవిడకి పంపుతూ ఉంటాడు. ఇవన్నీ విని ఓలెంకా మనసు భారమయ్యేది. అతని మీద సానుభూతి కలిగేది.

అతను తన గదికి వెళ్లబోతున్నప్పుడు అమె అతనితో అనేది. "దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలి. నాకు తోచనప్పుడు వచ్చి నాతో కాసేపు సమయం గడిపినందుకు ధన్యవాదాలు. దేవుడు మీకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలి. స్వర్గంలో ఉన్న దేవతలు…." భర్తని అనుకరిస్తూ ఇలా గంభీరంగా, ఉదాత్తంగా మాట్లాడుతూ ఉండేది. అప్పటికే అతను తన గదిదాకా వెళ్లిపోయి ఉంటాడు. అప్పుడు కాస్త గొంతు పెంచి చెప్పేది.

"వ్లదీమిర్ ప్లాటోనిచ్! మీరు మీ భార్యతో సఖ్యంగా ఉండాలి. ఆమెని క్షమించండి. కనీసం మీ అబ్బాయి కోసం. ఇప్పటికే అతనికి అన్ని విషయాలూ తెలుస్తూ ఉండి ఉండాలి."

పుస్తోవలోవ్ తిరిగివచ్చాక, ఈ సంగతులన్నీ గొంతు తగ్గించి రహస్యంగా చెప్పింది. ఇద్దరూ భారంగా తలలు విదిలించి నిట్టూర్చారు. ఆ అబ్బాయి గురించి మాట్లాడుకున్నారు. తండ్రి లేని లోటుని ఆ అబ్బాయి అనుభవిస్తూ ఉంటాడు కదా అనుకున్నారు. అంతలో ఏదో గుర్తొచ్చినట్టు, దేవుడి విగ్రహాల ముందు నుంచుని ప్రార్థనలు చేసారు- తమకి సంతానం కలిగేలా చూడమని.

అలా ఇద్దరూ ప్రశాంతమైన, ప్రేమమయమైన జీవితాన్ని ఆరేళ్లపాటు గడిపారు. ఒక చలికాలపు రోజున వేడి టీ తాగి, కలప డెలివరీ ఇవ్వడానికి వెళ్లిన పుస్తోవలోవ్‌కి జలుబు పట్టుకుని, జబ్బుపడ్డాడు. ఉన్నంతలో మంచి వైద్యులే అతనికి వైద్యం చేసారు కానీ, అతని పరిస్థితి దిగజారుతూనే ఉంది. నాలుగు నెలల జబ్బు అనంతరం చనిపోయాడు. ఓలెంకా మరోసారి భర్తృహీన అయింది.

"ఇలా వెళ్లిపోయి, నన్ను ఎలా వదిలేసావు, నా బుజ్జికొండా?" అని కార్యక్రమాలన్నీ అయిపోయాక రోదిస్తూనే ఉంది ఓలెంకా. "నువ్వు లేకుండా ఇప్పుడు నేనెట్లా బతకాలి? ఎందుకీ పాడు, విషాద జీవితం. అయ్యలారా, అమ్మలారా- దయచూపండి. అనాథనైపోయాను…"

నలుపు దుస్తుల్లోనే రోజుల్ని గడపసాగింది ఓలెంకా. తలకి హాట్ పెట్టుకోవడం, గ్లవ్స్ ధరించడం కూడా మానేసింది. చర్చ్‌కో, లేదంటే పుస్తోవలోవ్ సమాధి దగ్గరకో తప్ప అసలు బయటకి వెళ్లడమే మానేసి ఒక నన్‌లాగా జీవితం గడపడం ప్రారంభించింది. ఆరునెలలపాటు కిటికీ తలుపులు సైతం తెరవలేదు ఆమె. ఇప్పుడు పొద్దుటి పూట కాస్త

బయటకి రావడం, వంటమనిషితో కలిసి మార్కెట్‌కి వెళ్లడం ప్రారంభించింది. ఆ ఇంట్లో ఏం జరుగుతోందీ, ఆ ఇంట్లో ఆమె ఎలా ఉందీ అనేది మాత్రం జనాలు ఊహించలేని విషయం కాదు. వెటరినరీ సర్జన్‌తో కలిసి కూచుని, అతను పేపర్లో వార్తలు పైకి చదివి వినిపిస్తూండగా ఇద్దరూ కలిసి టీ తాగుతూ ఉండటం గమనించిన జనాలు తేలిగ్గానే ఊహించగలిగారు. పైగా, పోస్టాఫీస్ దగ్గర కలిసిన ఒకావిడతో ఓలెంకా అన్న ఈ మాటలు ఆ ఊహలకి అదనపు ఊతం ఇచ్చాయి.

"అసలు మన ఊళ్లో సరైన పశుసంరక్షణ జరగడం లేదు. ఈ అంటువ్యాధులు ఇలా ప్రబలడానికి అదే అసలు కారణం. పాలనుంచి వచ్చిన ఇన్‌ఫెక్షన్స్ గురించీ, గుర్రాలూ ఆవులూ వీటినుంచి సంక్రమిస్తున్న వ్యాధుల గురించీ పదేపదే వింటూనే ఉంటాం. మన ఆరోగ్యాల పట్ల మనం చూపించే శ్రద్ధ, మన దగ్గరున్న పశువుల పట్ల కూడా చూపించి తీరాలి."

వెటరినరీ సర్జన్ చెప్పిన మాటల్నే తిరిగి వల్లించడం కాకుండా, అతని అభిప్రాయాలనే తన అభిప్రాయాలుగా చేసుకుంది. ఏదో ఒక అనుబంధం లేకుండా ఒక సంవత్సరం పాటు కూడా ఆమె ఉండలేదని స్పష్టమై పోయింది. ఇప్పుడా అద్దెగది కొత్త సంతోషాలకి కారణభూతమైంది. ఇంకెవరైనా ఇలా చేస్తే ఇరుగూపొరుగూ ఈ ధోరణిని తప్పుబట్టేవారు కానీ, ఓలెంకా విషయంలో ఆమెని ఎవ్వరూ ఏమీ అనేవారు కాదు. ఆమె ఏం చేసినా అదే సరైన, సహజమైన విషయంగా అందరూ భావించేవారు. ఆమె గానీ, వెటరినరీ సర్జన్ గానీ తమ సంబంధంలో వస్తున్న కొత్తమార్పుని బహిరంగపరచలేదు. పైగా దానిని దాచివుంచటానికే ప్రయత్నించారు కానీ, అందులో పెద్దగా విజయవంతం కాలేకపోయారు. ఎందుకంటే, ఓ రహస్యాన్ని దాచిపెట్టడం ఓలెంకాకి చేతకాదు కాబట్టి. అతని రెజిమెంట్ మిత్రులు ఎవరైనా వచ్చినప్పుడు, ఓలెంకా వాళ్లకి టీ అందిస్తూనో భోజనం వడ్డిస్తూనో పశువుల్లో ప్లేగ్ గురించీ, వాటి కాళ్లకీ నోళ్లకీ వచ్చే జబ్బుల గురించీ, మునిసిపల్ కబేళాల గురించీ మాట్లాడేది. అతనికి ఇదంతా చచ్చేంత ఇబ్బందిగా ఉండేది. ఆ మిత్రులంతా వెళ్లిపోయాక, ఆవిడ భుజం గట్టిగా పట్టుకుని కోపంగా బుసకొట్టేవాడు.

"నీకు సరీగ్గా తెలియనివాటి గురించి మాట్లాడొద్దని ఇంతకుముందే చెప్పాను. వెటరినరీ సర్జన్స్ కూర్చుని మాట్లాడుకుంటున్నప్పుడు మధ్యలో దూరొద్దు. చాలా చిరాగ్గా ఉంటుంది," అన్నాడు.

ఆమె విభ్రాంతితో అతనివైపు చూసి, నెమ్మదిగా- "అయితే వోలోడిచ్కా, మరి నేను దేనిగురించి మాట్లాడాలి?" అనేది.

కన్నీళ్లతో అతన్ని కౌగలించుకొని, తన పట్ల ఆగ్రహాన్ని ప్రదర్శించవద్దని వేడుకునేది. ఆనక ఇద్దరూ కలిసిపోయి మామూలుగా సంతోషంగానే ఉండేవారు.

కానీ ఈ సంతోషం ఎక్కువ రోజులు కొనసాగలేదు. ఆ వెటరినరీ సర్జన్ బదిలీ మీద తన రెజిమెంట్‌తో కలిసి శాశ్వతంగా దూరంగా వెళ్లిపోవాల్సి వచ్చింది- దాదాపు సైబీరియాకి దగ్గరగా. ఓలెంకా ఒంటరిదైపోయింది.

నిజానికి ఆమె ఇప్పుడు చాలా ఒంటరి అయిపోయింది. ఆమె తండ్రి చాలా ఏళ్ల క్రితమే చనిపోయాడు. ఆయన వాడుతూ ఉండే పడకకుర్చీ ఒక కాలు విరిగి అటకమీదకి చేరి ప్రస్తుతం దుమ్ము కొట్టుకుపోయి ఉంది. ఆమె బరువు తగ్గింది. అందం తగ్గిపోసాగింది. ఇప్పుడు వీధిలో ఆమెకి ఎదురయినవాళ్లు మునుపటిలాగా ఆమెని చూడటం లేదు; అప్పట్లో పలకరించినట్టు పలకరించడం లేదు. అందమైన కాలం అంతా కరిగిపోయినట్టూ, ఇప్పుడు అస్పష్టమైన కొత్తజీవితం ఏదో ప్రారంభమైనట్టూ, అసలు దానిగురించి ఆలోచించకపోవడమే మంచిదైనట్టూ అనిపిస్తోంది ఆమెకి. సాయంత్రాలలో ఇంటి వెనకవైపు ఆవరణలో ఓలెంకా కూర్చుని ఉన్నప్పుడు, దూరంగా టివోలీ నుంచి ఆర్కెస్ట్రా ధ్వనులూ, టపాసుల చప్పుళ్లూ వినిపిస్తూనే ఉంటాయి



కానీ, అవి ఆమెలో ఏ ఆలోచనలూ రేకెత్తించేవి కావు. ఖాళీగా ఉన్న ఇంటి ఆవరణని ఏ ఆలోచనా లేకుండా, ఏ కోరికా లేకుండా శూన్యంగా చూసేది. రాత్రి నిద్రల్లో ఆ ఖాళీ ఆవరణ గురించే కలలు వచ్చేవి. తినడం, తాగడం కూడా ఏదో తన ఇష్టానికి వ్యతిరేకంగా చేస్తున్నట్టు చేసేది.

కానీ, అన్నింటికన్నా ముఖ్యంగా, అన్నింటికన్నా దారుణంగా, ఇప్పుడు ఆమెకి ఏ అభిప్రాయాలూ లేవు. తన చుట్టూ ఉన్న వస్తువులని చూస్తూనే ఉంది, తన చుట్టూ జరుగుతున్నవి చూస్తూనే ఉంది, కానీ వాటి గురించి ఆమెకి ఎలాంటి అభిప్రాయాలూ లేవు; వాటిగురించి ఏం మాట్లాడాలో కూడా తెలీదు. అసలు ఎలాంటి అభిప్రాయమూ లేకపోవడం ఎంత దారుణం! ఉదాహరణకి, నీకు అక్కడో సీసా కనబడుతోంది, లేదూ వర్షం పడుతోంది, లేదూ

ఎవరో రైతు ఎడ్లబండి తోలుకుంటూ వెళుతున్నాడు అనుకుందాం. ఆ సీసాకానీ, ఆ వర్షం కానీ, ఆ బండి కానీ ఆయా పరిస్థితులలో ఎందుకున్నాయో, అవి నీకు ఎలాంటి వాస్తవిక స్పృహని కలగజేస్తున్నాయో అన్నవి నువ్వేమీ చెప్పలేకపోతున్నావన్నమాట. కుకిన్ ఉన్నప్పుడూ, పుస్తోవలోవ్ ఉన్నప్పుడూ, చివరికి వెటరినరీ సర్జన్ స్మిర్నిన్ ఉన్నప్పుడు కూడా ఓలెంకా అన్నింటి గురించి వివరించగలిగేది, దేనిగురించైనా సరే అభిప్రాయం చెప్పగలిగేది. కానీ ఇప్పుడు ఆమె ఆలోచనల్లోనూ, ఆమె హృదయంలోనూ ఆ ఇంటివెనక ఖాళీస్థలంలో ఉన్నలాంటి ఖాళీతనమే ఉంది. అసలంతా చేదుగా, వగరుగా ఉంది.

క్రమంగా ఊరు పెద్దదై, అన్నివైపులా విస్తరిస్తూ ఉంది. చిన్న చిన్న రోడ్లు విశాలమైన వీధులయ్యాయి. ఒకప్పుడు టివోలీ, కలప డిపో ఉన్న చోట్లల్లో ఇప్పుడు పెద్దపెద్ద ఇళ్లు వచ్చేసాయి. కాలం ఎంత వేగంగా గడుస్తూ ఉంటుంది! ఓలెంకా ఇల్లు మాసిపోయింది; రూఫ్ తుప్పుపట్టినట్టయింది; వెనకభాగం అంతా పిచ్చిమొక్కలతో ముళ్లకంపల్తో నిండిపోయింది. వయసు మీద పడుతున్న కొద్దీ ఓలెంకాలో మునుపటి అందం మాయమైపోతూ ఉంది. వేసవిలో ఇంటివెనక ఆవరణలో కూర్చుంటే అలసిన మనసు ఖాళీగానూ, చేదుగానూ ఉంటోంది. చలికాలంలో కిటికీ దగ్గర కూచుని పడుతున్న మంచుని చూస్తూ ఉండేది. వసంతంలో ఎప్పుడైనా కెథీడ్రల్ గంటల చప్పుడు గాలిలో వినిపించినప్పుడు, గతకాలపు జ్ఞాపకాల వరద ఆమెని ముంచేసి మనసు ఒకలాంటి తీయనైన బాధతో మెలితిరిగేది; కన్నీటి ప్రవాహం ధారగా సాగుతుండేది. కానీ అదంతా ఒక నిమిషం పాటే. అంతలోనే మళ్లీ శూన్యం ఆవరించేది. అసలు తను ఎందుకు బతికివుందో అర్థమయ్యేది కాదు. పెంచుకుంటున్న నల్లపిల్లి వచ్చి ఆమెని రుద్దుకుంటూ ముద్దుగా ప్రేమగా మూలిగేది. కానీ ఆ సున్నితత్వాలేవీ ఆమెని తాకేవి కాదు. ఇలాంటి ప్రేమా కావలసింది? తన అస్తిత్వాన్నీ, మనసునీ, ఆత్మనీ మొత్తం కమ్మేసి, మెదడుకి ఆలోచననీ, జీవితానికి మార్గాన్నీ, ఉడిగిపోతున్న వయసుకి ఉడికిపోతున్న రక్తాన్నీ ఇచ్చేంత ప్రేమ కావాలి. తన నల్లపిల్లిని ఒకసారి తడిమి "పో, ఇక్కడ నీకేమీ పని లేదు!" అనేది.

అలా రోజులూ, సంవత్సరాలూ గడిచిపోయాయి. ఒక సంతోషం లేదు, ఎలాంటి అభిప్రాయాలూ లేవు. వంటమనిషి ఏది చెప్తే అదే వినడం.

వేసవికాలపు జులైలో ఒక రోజు సాయంతపు గోధూళి వేళ, ఇంటి వెనక భాగం అంతా ధూళిమేఘాలతో నిండిపోయివున్న వేళ, గేటుమీద ఎవరో కొట్టినట్టు చప్పుడైంది. తీయడానికి స్వయంగా వెళ్లిన ఓలెంకా నోట మాట రాకుండా అలాగే నిలబడిపోయింది. గేటు బయట వెటరినరీ సర్జన్ స్మిర్నిన్ నిలుచుని ఉన్నాడు. జుట్టు ఇప్పుడు తెల్లబడిపోయి ఉంది. యూనిఫాంలో కాకుండా ఇప్పుడు మామూలు సివిలియన్ డ్రస్‌లో ఉన్నాడు. ఒక్కసారి స్పృహలోకి వచ్చి, కన్నీళ్లు చిప్పిల్లుతుండగా తనని తాను సంబాళించుకోలేక అతని గుండెలమీద తలపెట్టుకుంది, మౌనంగా. ఆమె ఎంతగా కదిలిపోయిందంటే, ఇంట్లోకి ఎలా వచ్చారో, ఇద్దరూ కలిసి టీ తాగడానికి ఎలా కూర్చున్నారో కూడా ఆమె గమనింపులో లేనంత.

సంతోషంతో వణికిపోతూ, "నా బుజ్జి కన్నా!" అని గొణిగింది. "వ్లాడిమిర్ ప్లాటోనిచ్! దేవుడు ఎక్కణ్ణుంచి పంపించాడు నిన్ను నాదగ్గరికి?" అంది.

"ఇక్కడే ఉండిపోవడానికి వచ్చాను," అన్నాడు అతను. "ఇప్పుడు రిటైరై పోయాను. ఇక ప్రశాంతంగా జీవితం గడపాలని ప్రయత్నం. ఇప్పుడు మా అబ్బాయికి స్కూలుకి వెళ్లాల్సిన వయసొచ్చింది. ఇప్పుడు పెద్దవాడయ్యాడు. ఇంకో విషయం, నా భార్యతో నేను రాజీ పడ్డాను."

"ఇప్పుడెక్కడుంది తను?" అని అడిగింది ఓలెంకా.

"అబ్బాయితో కలిసి హోటల్లో ఉంది. నేనేమో ఇంటికోసం వెతుకుతున్నాను."

"ఈ ఇల్లు తీసుకో, ఇది మాత్రం ఇల్లు కాదా? నీనుంచి అద్దెని కూడా ఏమీ అక్కర్లేదు నాకు," అంది ఓలెంకా ఉద్వేగంతో ఏడుస్తూ. "ఇక్కడే ఉండండి. నేను వెనక ఉన్న గదుల్లోకి మారతాను. దేవుడా, ఎంత ఆనందాన్నిచ్చావయ్యా!"

మరుసటి రోజు రూఫ్‌కి పెయింటింగ్, గోడలకి సున్నాలూ వేయడం ప్రారంభం అయ్యాయి. నడుము మీద చేతులు పెట్టుకుని అందరికీ ఆదేశాలు ఇస్తూ ఓలెంకా అటూయిటూ చకచకా తిరిగింది. మునుపటి నవ్వు ఆమె మొహం మీదకి తిరిగిరావడంతో ఒక దీర్ఘకాలపు సుషుప్తిలోనుంచి లేచిన మనిషిలా సజీవంగా, తాజాగా అయిపోయింది. సర్జన్ భార్య కూడా వచ్చింది. సన్నగా, పొట్టి జుట్టుతో, స్థిరం లేని చూపులతో చాలా సాధారణంగా ఉంది ఆవిడ. ఆవిడతో బాటు పిల్లవాడు సాషా వచ్చాడు. అసలు వయసు కన్నా (పది నడుస్తోంది అతనికి) చిన్నవాడుగా కనిపిస్తున్నాడు. నీలికళ్లతో, సొట్ట బుగ్గలతో, బొద్దుగా ఉన్నాడు.

వస్తూనే, నల్లపిల్లి వెనకాల సంతోషంగా నవ్వుకుంటూ పరిగెత్తాడు.

"ఆంటీ, ఇది మీ పిల్లేనా? దానికి పిల్లలు పుట్టినప్పుడు మాకోటి ఇవ్వరూ, ప్లీజ్? ఎలుకలంటే మమ్మీకి భయం," అన్నాడు.

ఓలెంకా అతనితో మాట్లాడుతూ అతనికి టీ ఇచ్చింది. రొమ్ముల వెనకాల గుండె వెచ్చబడడమే కాకుండా, తీయగా మెలిపెట్టబడిన భావన- వాడేదో తన కొడుకే అయినట్టు. ఆ సాయంత్రం అతను టేబుల్ దగ్గర కూర్చుని పాఠాలు చదువుకుంటున్నప్పుడు అతనివైపు చాలా మృదువుగా, ఇష్టంగా చూసింది.

"నా బుజ్జి కన్నా, నా ముద్దుల కన్నా.. ఎంత మంచి పిల్లాడో! తెలివైన పిల్లాడు కూడా!" అంది రహస్యం చెబుతున్నట్టు అతనితో.

"*ద్వీపము అనగా చుట్టూ నీరు ఉండి మధ్యలోనున్న భూభాగము,*" పిల్లవాడు చదువుతున్నాడు.

"*ద్వీపము అనగా చుట్టూ నీరు ఉండి…*" ఓలెంకా తిరిగి వల్లించింది. తన ఆలోచనల్లో ఏళ్ల తరబడి పేరుకున్న మౌనమూ, శూన్యమూ తర్వాత నమ్మకంగా చెప్పిన ఆమె మొదటి అభిప్రాయం ఇది.

ఇప్పుడు తనకి స్వంత అభిప్రాయాలు వచ్చేసినట్టుగా అనిపిస్తోంది. చదువులు ఇప్పుడు ఎంత కష్టంగా మారాయో, ఈ ఆధునిక విద్యల కంటే సాంప్రదాయికమైన చదువులే ఎంత మంచివో, ఎందుకంటే స్కూల్ చదువు అయ్యాక ఎదురుగా రకరకాల మార్గాలు ఉంటాయి కాబట్టి డాక్టర్ కావొచ్చు, కావాలంటే ఇంజినీర్ కావొచ్చు- ఇలాంటి విషయాలన్నీ ఓలెంకా రాత్రి భోజనాల వేళప్పుడు సాషా పేరెంట్స్‌తో మాట్లాడింది.

సాషా స్కూల్‌కి వెళ్లడం ప్రారంభించాడు. వాడి అమ్మ తన సోదరిని చూడటానికని ఖార్‌కావ్ వెళ్లింది, మళ్లీ తిరిగిరాలేదు. నాన్నేమో పశువుల మందలని పరీక్షించడానికి ఎక్కడెక్కడికో వెళుతూ ఉండేవాడు, కొన్నిసార్లు రోజుల తరబడి ఇంటికి దూరంగా ఉండేవాడు. సాషా పూర్తిగా నిర్లక్ష్యానికి గురి అవుతున్నట్టు, వాళ్ల ఇంట్లోనే అతని అవసరం ఎవరికీ లేనట్టు, అతని ఆకలిని కూడా ఎవరూ పట్టించుకోనట్టు ఓలెంకాకి అనిపించసాగింది. అతన్ని తను ఉంటున్న చోటికి తీసుకెళ్లి అతనికి ఒక చిన్నగది ఏర్పాటు చేసింది.

అలా ఆరు నెలలపాటు సాషా ఆమెతోనే ఉండిపోయాడు. పొద్దున్నే లేచి ఓలెంకా అతని గదిలోకి వెళ్లేది. చెంపలకింద చేతులు పెట్టుకుని, శ్వాస తేలిగ్గా తీసుకుంటూ, గాఢనిద్రలో

ఉండేవాడు. వాడిని నిద్రలేపాలంటే అయ్యో అనిపించేది ఆమెకి.

"సషేంకా, నిద్ర లేమ్మా! స్కూల్‌కి టైమవుతోంది," అనేది కొద్దిగా జాలిపడుతూనే.

వాడు లేచి, డ్రస్ వేసుకుని, ప్రార్థన చేసేసుకుని, టీ తాగడానికి కూర్చునేవాడు. మూడు కప్పుల టీ, రెండు పెద్ద బ్రెడ్ ముక్కలూ, సగం ఫ్రెంచ్ రోల్ బటర్‌తో. అప్పటికీ నిద్రనుంచి పూర్తిగా మేలుకునేవాడు కాదు, కొంచెం చిరాకులో ఉండేవాడు.

"నువ్వు పాఠం బాగా చదువుకోలేదు, సషేంకా," అంటుంది ఓలెంకా అతనేదో సుదూర ప్రయాణానికి వెళ్తున్నట్టు అతనివైపు చూస్తూ. "అలా చేస్తే నాకు దిగులుగా ఉండదూ?. నువ్వు బాగా చదువుకోవాలి నాన్నా! టీచర్లు చెప్పింది వినాలి."

"అబ్బా, నాపాటికి నన్నొదిలెయ్, ప్లీజ్" అంటాడు సాషా.

తర్వాత స్కూల్‌కి బయలుదేరతాడు. చిన్నపిల్లాడు, పెద్ద కాప్. వీపుమీద పుస్తకాల సంచీ. ఓలెంకా నిశ్శబ్దంగా అతన్ని ఫాలో అవుతుంది.

"సషేంకా…!" అని పిలుస్తుంది.

అతను తిరిగిచూడగానే అతని చేతిలో ఖర్జూరమో, ఒక చాక్‌లెట్టో ఏదో ఒకటి పెడుతుంది. ఇక స్కూల్‌కి వెళ్లడానికి తిరగాల్సిన మలుపులో అతనికి ఇబ్బందిగా ఉంటుంది- ఈ పొడుగ్గా, లావుగా ఉన్న ఆవిడ తనని ఫాలో అవుతున్నందుకు. వెనక్కి తిరిగి, "ఇక ఇంటికి వెళ్లు, ఆంటీ. నా అంతట నేను వెళ్లగలను," అంటాడు.

ఆమె అక్కడే ఆగిపోయి, అతను స్కూల్ ద్వారాలు దాటుకుని అదృశ్యం అయిపోయేవరకూ అలా తదేకంగా చూస్తూవుంటుంది, రెప్పకూడా వేయకుండా. ఎంత ప్రేమిస్తుంది తను వాణ్ణి! ఇంతకుముందు ఏ అనుబంధాల్లోనూ ఇంత లోతైనది లేదు; ఇంత నిస్వార్థంగా, అనాయాసంగా, ఇంత సంతోషంగా తన ఆత్మని సమర్పించలేదు. తలుచుకుంటూంటే ఆ మాతృప్రేమ తనని మరింతగా, ఇంతలింతలుగా దహించివేస్తున్నట్టుగా ఉంది. తన పిల్లాడు కాని ఈ పిల్లాడికి, అతని బుగ్గలమీద సొట్టలకి, ఆ కాప్‌కీ తన పూర్తి జీవితం సంతోషంగా, ప్రేమ నిండిన కన్నీళ్లతో ఇచ్చేయదూ? ఎందుకు? ఎందుకంటే ఎవరికి తెలుసు?

సాషాని అలా స్కూల్‌కి పంపించేసాక నెమ్మదిగా ఇంటికి తిరిగొస్తుంది- తృప్తిగా, ప్రశాంతంగా, మనసంతా ప్రేమతో. గత ఆరునెలల్లో కాస్త పూర్వపు కళని తిరిగి తెచ్చుకున్న ఆమె ముఖంలో సంతోషంగా ఒక నవ్వు

విచ్చుకుంటుంది. ఆమెని కలిసి, ఆవిడని పరీక్షగా చూసినవాళ్లు, ఆనందంగా ఆమెతో అంటారు:

"గుడ్ మార్నింగ్, ఓల్గా సెమియొనోవా డార్లింగ్! ఎలా ఉన్నావు, డార్లింగ్?"

"స్కూల్ చదువులు ఈరోజుల్లో చాలా కఠినతరమవుతున్నాయి," అంటుంది. "నిన్న మొదటి తరగతి అబ్బాయికి ఒక చిన్నకథ ఇచ్చి, బట్టీపెట్టుకుని రమ్మన్నారు. దానికి తోడు ఒక లాటిన్ అనువాదం, ఒక లెక్క కూడా. ఒక చిన్నపిల్లవాడికి ఎంత కష్టం!"

ఇంకా టీచర్ల గురించీ, పాఠాల గురించీ, పుస్తకాల గురించీ చెబుతుంది. సాషా తనకి చెప్పినవన్నీ తిరిగి వల్లిస్తుంది.

మధ్యాహ్నం రెండు, మూడు మధ్య భోజనం చేస్తారు ఇద్దరూ కలిసి. సాయంత్రం కలిసి హోమ్‌వర్క్ చేస్తారు. రాత్రికి నిద్రపుచ్చేటప్పుడు వాడితో చాలా సమయం గడిపి, ప్రార్థన చేస్తుంది. తను నిద్రకి ఉపక్రమించాక, సాషా చదువు పూర్తిచేసినట్టూ, డాక్టరో ఇంజినీరో అయినట్టూ, పెద్ద ఇల్లూ గుర్రాలూ గుర్రబ్బండీ ఉన్నట్టూ, పెళ్లిచేసుకున్నట్టూ, పిల్లల్ని కన్నట్టూ… ఇలా కలలు కంటుంది. గాఢనిద్రలోనూ ఇవే సంగతులు ఆలోచించుకుంటూ ఉండగా, చెక్కిళ్ల మీదుగా కన్నీళ్ల ప్రవాహం సాగుతూంటుంది. చిన్న నల్లపిల్లి ఆమె పక్కన చేరి ముద్దుగా మూలుగుతూ ఉంటుంది.

ఇంతలో గేటు ఎవరో కొట్టినట్టు చప్పుడవుతుంది. భయంతో ఊపిరి ఆగినంత పనై, గుండె దడదడా కొట్టుకుంటూండగా ఓలెంకా నిద్రలోంచి ఉలిక్కిపడి లేస్తుంది. ఒక అరనిమిషం గడుస్తుంది. గేటుని బాదడం ఇంకా ఎక్కువవుతుంది.

"ఖార్కావ్ నుంచి టెలిగ్రామ్ అయివుంటుంది," అనుకుంటుంది నిలువెల్లా వణికిపోతూ. "సాషా వాళ్ల అమ్మ అతన్ని ఖార్కావ్‌కి పంపించమని అయివుంటుంది. దేవుడా!"

ఆమె నిరాశలో కూరుకుపోతుంది. తల, చేతులు, కాళ్లు మొద్దుబారిపోయినట్టయిపోతాయి. ప్రపంచంలో తనకంటే దురదృష్టకరమైన మనిషి మరొకరు ఉండరనిపిస్తుంది. ఇంకో నిమిషం గడుస్తుంది. కొన్ని గొంతులు వినిపిస్తాయి. వెటరినరీ సర్జన్ క్లబ్ నుంచి ఇంటికి వస్తూంటాడు.

"అమ్మయ్య.. దేవుడు రక్షించాడు," అనుకుంటుంది.

గుండెలమీదనుంచి భారం దిగిపోయినట్టయి, ఇప్పుడు కొంచెం తేలిగ్గా అనిపిస్తుంది. పడుకుని సాషా గురించి ఆలోచిస్తూ ఉంటుంది. ఆ సాషా

పక్క రూమ్‌లో పడుకుని గొణుక్కుంటూ ఉంటాడు, నిద్రలోనే.

"చూపిస్తా, చూపిస్తానంటున్నానుగా! పో, బయటికి! వద్దు, గొడవొద్దు!"

*